క్లుప్తంగా

హుండీ ఆదాయం లెక్కింపు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని బైటిపేటలో వెలసిన ఆంజనేయ, కోదండ రామస్వామి దేవస్థానం హుండీ సొమ్మును బుధవారం లెక్కించారు. దేవదాయ శాఖ తనిఖీ అధికారి శశికుమార్ మాట్లాడుతూ ఈ ఏడాది హుండీ మొత్తం రూ.5,53,906 లభించిందన్నారు. గతేడాది కంటే రూ.13,434 అధికంగా లభించిందన్నారు. చైర్మన్ చెన్నా వెంకటేశ్వర్లు, ఈఓ రామాంజనేయశర్మ, ధర్మకర్తల మండలి సభ్యులు విజయలక్ష్మి, జమ్మీశ్వరి, లక్ష్మీదేవి, సుబ్బరాయుడు, అర్చకులు సుబ్బయ్య పాల్గొన్నారు.

ముగిసిన ఆలయ వార్షికోత్సవ వేడుకలు



చండీ హోమం పూర్ణాహుతి గావిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని జగజ్జననీ నగర్‌లో వెలసిన జగజ్జననీ ఆలయ వార్షికోత్సవ వేడుకలు బుధవారం చండీ హోమంతో ముగిశాయి. తెల్లవారుజామున అమ్మవారికి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించారు. భక్తులు అందజేసిన వివిధ రకాల పండ్లను ఆలయ గోపురానికి అలంకరించారు. అనంతరం చండీ హోమం చేపట్టి, బలిప్రదానం అనంతరం పూర్ణాహుతి గావించారు. అనంతరం అమ్మవారికి మహామంగళ హారతులు ఇచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం అమ్మవారికి ప్రదోష పూజలు జరిపించారు.

కోడ్‌కు అనుగుణంగా పనిచేయాలి

గోస్పాడు: సచివాలయ సిబ్బంది ఎన్నికల కోడ్‌కు అనుగుణంగా పనిచేయాలని ఎంపీడీఓ నాగఅనసూయ సూచించారు. మండలంలోని దీబగుంట్ల, గోస్పాడు గ్రామాల్లో ఎన్నికల ప్రవర్తన నియమావళిపై సచివాలయ, అంగన్‌వాడీ సిబ్బందికి బుధవారం అవగాహన కల్పించారు. అనంతరం ఆయా గ్రామాల్లో రాజకీయ పార్టీలకు సంబంధించిన స్టిక్కర్లు, పోస్టర్లు తొలగించాలని ఆదేశించారు.

నోటి క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ

నంద్యాల టౌన్: ప్రతి ఒక్కరూ నోటి క్యాన్సర్ గురించి అవగాహన పెంచుకోవాలని జిల్లా వైద్యారోగ్యాధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. బుధవారం నేషనల్ ఓరల్ హెల్త్ డే సందర్భంగా స్థానిక కార్యాలయం నుంచి సాయి బాబా నగర్ ఆర్చ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పొగాకు, బీడీ, సిగరెట్ లాంటి క్యాన్సర్ కారక వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. అతి చల్లని, వేడి పదార్థాలకు దూరంగా ఉండాలని చెప్పారు. జిల్లా టీబీ అధికారి శారదాబాయి, డాక్టర్ జగదీష్ చంద్రారెడ్డి, కాంతారావు నాయక్, డెమో ఆఫీసర్ రవీంద్ర నాయక్ ఉన్నారు.

మసీదులకు జంకానాల అందజేత

నంద్యాల(వ్యవసాయం): రంజాన్ మాసంలో అంజుమన్ సంస్థ అధ్యక్షుడు అబ్దుల్‌కుద్దూస్ బుధవారం మసీదులకు జంకానాల అందజేశారు. ఆయన మాట్లాడుతూ 87 మసీదులకు రెండు చొప్పున జంకానాలు అందజేశామని, వీటి విలువ రూ.4.50 లక్షలు ఉంటుందని చెప్పారు.అబ్దుల్‌హక్, మున్నా, అంజాద్‌బాషా, గౌస్ ఉన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు



ఆర్.నాగులవరంలో ప్రజలకు సూచనలు ఇస్తున్న శిరివెళ్ల సీఐ

రుద్రవరం: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో ఎలాంటి అల్లర్లు సృష్టించవద్దని శిరివెళ్ల సీఐ చంద్రబాబు, రుద్రవరం ఎస్ఐ నిరంజన్‌రెడ్డి ప్రజలకు సూచించారు. మండలంలోని ముత్తలూరు,తిప్పారెడ్డిపల్లె,ఆర్.నాగులవరం గ్రామాల్లో బుధవారం వారు 60 మంది బీఎస్‌ఎఫ్ బలగాలతో కవాతు నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ప్రజలకు ఎన్నికల విషయంపై సలహాలు సూచనలు చేశారు. ఎన్నికల సందర్భంగా ఓటర్లను తమ వైపు ఆకర్షించుకునేందుకు ప్రలోభ పరచడం, లేదంటే బెదిరించడం వంటివి చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే సమాచారం అందించాలని, అలాంటి పేర్లు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. ఉప సర్పంచు సింహం, ఏఎస్ఐ శోబన్‌బాబు,వీఆర్వో పుల్లయ్య ఉన్నారు. అలాగే.. రాత్రి రుద్రవరంలో పోలీసు బలగాలు కవాతు నిర్వహించాయి. అమ్మవారిశాల సెంటర్‌లో సీఐ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా నడుచుకోవాల్సిన తీరుపై స్థానికులకు అవగాహన కల్పించారు.



చెన్నూరుకు రూ.98 లక్షలతో వేసిన రోడ్డు



గ్రామ సచివాలయ భవనం



రూ.78.50 లక్షలతో కొత్తగా నిర్మించిన గోదాము

అభివృద్ధికి చిరునామా చెన్నూరు

- ఇసుకపల్లె నుంచి గోవిందపల్లెకు రూ.6 కోట్లతో బీటీ రోడ్డు
- చెన్నూరులో రూ.78.50 లక్షలతో ప్రాథమిక పాఠశాలకు ఆధునిక హంగులు
- రూ.70 లక్షలతో ఇసుకపల్లె ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధి
- రూ.41 లక్షలతో రెండు ఆర్బీకేల నిర్మాణం
- రూ.75 లక్షలతో రైతు భరోసా గోడౌన్ ఏర్పాటు
- చెన్నూరుకు రూ.98 లక్షలతో రోడ్డు సౌకర్యం



చెన్నూరు ప్రభుత్వ పాఠశాలలో ఆధునిక విధానంలో బోధన, బెంచీలపై కూర్చొని ఆలకిస్తున్న విద్యార్థులు

శిరివెళ్ల: దేశానికి స్వాంతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లయినా చాలా గ్రామాల్లో కనీస వసతులు లేవంటే అతిశయోక్తి కాదు. అభివృద్ధికి దూరంగా, నాగరికత చిహ్నలైన రోడ్లు లేక ప్రజల అవస్థలు వర్ణనాతీతం. అయ్యా.. మా సమస్యలను పరిష్కరించండని పలు మార్లు వేడుకున్నా నాటి పాలకులకు పట్టలేదు. కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే గ్రామాల ముఖం చూడటం, కచ్చితం చేద్దామంటూ బూటకపు హామీలతో మభ్యపెట్టడం, గెలిచిన తరువాత వాటిని మరిచి పోవడం నిత్య కృత్యమైంది. దీంతో ప్రజలు కూడా తమ తలరాత ఇంతేననుకున్నారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహాత్మా గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధన దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేశారు. పాలనను ప్రజలకు మరింత చేరువ చేయాలని ప్రతి గ్రామ పంచాయతీలో గ్రామ సచివాలయం, రైతు భరోసా, సిమెంట్ రోడ్లు, గ్రామీణ రోడ్ల ఏర్పాటుతో పాటు వసతుల కల్పనకు ప్రాధాన్యమిచ్చారు. మండలంలోని చెన్నూరు గ్రామ పంచాయతీ, మజరా ఇసుకపల్లె గ్రామం నేడు అభివృద్ధి దిశలో పరుగులు తీస్తున్నాయి.



అభివృద్ధి పనులు ఇలా..

- రూ. 43 లక్షలతో గ్రామ సచివాలయం ఏర్పాటు
- రూ. 41 లక్షలతో మూడు సిమెంట్ రోడ్ల నిర్మాణం
- చెన్నూరులో రూ.78.50 లక్షలతో నాడు-నేడు కింద ప్రాథమికోన్నత పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణాలు. విద్యార్థులకు బెంచీలు, మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు
- 2006లో చెన్నూరుకు గ్రామీణ రోడ్డు వేశారు. అయితే పదేళ్లుగా రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో ప్రయాణికి ప్రజలకు ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్ ప్రభుత్వం రూ.98 లక్షలు మంజూరు చేయడంతో రోడ్డు నిర్మాణం పూర్తి చేయడంతో గ్రామస్తుల ప్రయాణం సాఫీగా సాగుతోంది.
- రూ.41 లక్షలతో 2 రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలు జరుగుతున్నాయి. రూ.17.5లక్షలతో వైఎస్సార్ హెల్త్ సెంటర్ నిర్మాణం మొదలైంది.
- రైతులు దిగుబడులను భద్రపరుచుకునేందుకు, నిల్వ ఉంచుకునేందుకు కోసం రూ.75 లక్షలతో రైతు భరోసా గోడౌన్ నిర్మాణం పూర్తయ్యింది. రైతులు తమ గ్రామంలోనే గిట్టుబాటు ధర వచ్చేంత వరకు ధాన్యాన్ని నిల్వ చేసుకోవచ్చు.
- సొంత స్థలం కలిగిన 40 మందికి పక్కా గృహాలు మంజూరు కాగా ఇందులో 38 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి.
- ఇసుకపల్లె బీసీ కాలనీలో రూ.10 లక్షలతో రెండు అంతర్గత సిమెంట్ రోడ్లు వేశారు.
- మన బడి నాడు- నేడు కింద ప్రాథమికోన్నత పాఠశాలను రూ.70 లక్షలతో అభివృద్ధి చేశారు.
- గ్రామానికి 48 పక్కా గృహాలు మంజూరు కాగా 40 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి.
- ఇసుకపల్లె నుంచి గోవిందపల్లెకు రూ. 6 కోట్లతో లింక్ బీటీ రోడ్డు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

రోడ్డు కష్టాలు తప్పాయి



మా గ్రామానికి 18 ఏళ్ల క్రితం రోడ్డు వేశారు. కాలక్రమేణా రోడ్డు ధ్వంసమైంది. పది సంవత్సరాల నుంచి గుంతలు పడి నడవడానికి కూడా కష్టంగా మారింది. రోడ్డు వేయాలని గతంలో అధికారులు, నాయకులను కోరినా పట్టించుకోలేదు. ఇప్పుడైనా పనులు చేస్తారో చేయరోనని అనుమానంతోనే మొక్కుబడిగా వినతి పత్రం అందజేయగా ప్రస్తుత ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయడంతో ఇటీవల రోడ్డు వేశారు. ఒక్కసారి ఇచ్చిన వినతి ప్రతానికే వెంటనే రోడ్డు వేయడం మాకు ఆశ్చర్యం వేసింది. ఇప్పుడు ప్రయాణం సాఫీగా సాగుతోంది.

– ప్రసన్న, గ్రామస్తుడు

రైతులకు మేలు జరిగింది



మా గ్రామానికి దగ్గరలోనే గోడౌన్ కట్టారు. రైతులకు చాలా ఉపయోగంగా ఉంది. మేము పండించిన ధాన్యం నిల్వ చేసుకోవాలంటే నంద్యాలకు వెళ్లాల్సి వచ్చేది. రవాణా ఖర్చులు కొంత భారంగా ఉండేవి. ఇప్పుడు మాకు దగ్గరలోనే గోదాము నిర్మించడంతో ఖర్చులు మిగలడంతో అవస్థలు తప్పాయి. సౌకర్యాంగానూ ఉంటుంది. అలాగే గ్రామ రైతు భరోసా కేంద్రంలో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేస్తున్నాం. గతంలో పట్టణానికి వెళ్లి తెచ్చుకోవడానికి అదనపు శ్రమ, ఖర్చు అయ్యేది. ఇప్పుడు పొలానికి వెళ్లేటప్పుడు అక్కడే కొని బండిపై వేసుకొని వెళ్తున్నాం. జగనన్న రైతులకు ఉపయోగపడేలా మంచి పనులు చేయడం అభినందనీయం.

– మేర్వ నాగభూషణంరెడ్డి, రైతు

ఎన్నికల నిబంధనలు పాటించాలి

నంద్యాల(అర్బన్): ప్రతి ఉద్యోగి ఎన్నికల నిబంధనలు పాటించాల్సిందేనని ఎంపీడీఓ సౌభాగ్యం సూచించారు. మండలంలోని అయ్యలూరు, చాబోలు, పెద్దకొట్టాల గ్రామాల సచివాలయాల్లోని పోస్టర్లు, నోటీసు బోర్డులు, బ్యానర్లు తదితరాలను సిబ్బంది సహకారంతో తొలగించారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

గోస్పాడు: ఎన్నికలలో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్ఐ నాగార్జున రెడ్డి కోరారు. మండలంలోని యాళ్లూరులో బుధవారం రాత్రి గ్రామ ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బెల్లం ఊట ధ్వంసం

బొమ్మలసత్రం: పాణ్యం మండలం కొండజూటూరు గ్రామ శివారులో అక్రమంగా నిర్వహిస్తున్న నాటుసారా స్థావరాలపై సెబ్ అధికారులు బుధవారం దాడులు చేశారు. సెబ్ సీఐ విశ్వనాథరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గ్రామ శివారులో నాటుసారా తయారు చేస్తున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు చేశామన్నారు. అక్కడ నాటుసారా తయారు చేస్తున్న పాణ్యం చెంచు కాలనీకి చెందిన దాసరి నారాయణరావును అరెస్టు చేసి 1500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామని చెప్పారు. అలాగే అక్కడి నుంచి పాణ్యానికి తరలిస్తున్న 45 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకునట్లు వివరించారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



మాట్లాడుతున్న శ్రీమహాన

నంద్యాల(న్యూటౌన్): క్షేత్రస్థాయి ఆర్థిక అక్షరాస్యతపై బుధవారం పట్టణంలోని ఇంద్రప్రస్త సమావేశ భవనంలో లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రవీంద్రకుమార్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందుకు ముఖ్యఅతిథిగా హాజరైన రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ శ్రీమహాన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఆర్థికపరమైన అవకతవకలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఆన్‌లైన్ చెల్లింపులు, సరుకుల కొనుగోలు, డెబిట్, క్రెడిట్ కార్డు వాడే విధానం, పిన్ నంబర్లు తదితర వాటి గురించి వివరించారు. సైబర్ నేరాలపై డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి అవగాహన కల్పించారు. ఆర్‌బీఐ మేనేజర్ పూర్ణిమ, సుమ, నాగప్రవీణ్, నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి, రవీంద్రకుమార్, ఎల్లయ్య పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన టీడీపీ సానుభూతిపరులు



మాజీ మంత్రి శిల్పామోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన 19, 12వ వార్డుల టీడీపీ నాయకులు

రుద్రవరం: మండలంలోని మందలూరు గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి, హరిరెడ్డి, శ్రీకాంతరెడ్డి,లింగారెడ్డితో పాటు మరో పది టీడీపీకి చెందిన కుటుంబాలు ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సమక్షంలో బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. గ్రామానికి చెందిన మండల ఉపాధ్యక్షుడు వీరశంకర్‌రెడ్డి, సర్పంచు నిర్మలాదేవి,వార్డు సభ్యుడు అస్సాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి,లింగారెడ్డి,వెంకటసుబ్బారెడ్డి,గోళ్ల బాలుడు,వెంకటనరసింహారెడ్డి,పెద్ద అస్సాన్,సుధాకర్ రెడ్డి,శ్రీనాథరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ వర్గీయులు ఆళ్లగడ్డలో ఎమ్మెల్యే స్వగృహంలో పార్టీలో చేరగా వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. ఆళ్లగడ్డ మార్కెట్‌యార్డు కమిటీ చైనకమన్ గంధం రాఘవరెడ్డి, విజయ డెయిరీ డైరెక్టర్ విజయసింహారెడ్డి ఉన్నారు.

నంద్యాల(అర్బన్): పట్టణంలోని 19వ వార్డుకు చెందిన కళాకారుల కుటుంబాలు వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ శ్రీరాములు ఆధ్వర్యంలో మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి సమక్షంలో బుధవారం టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. అలాగే 12వ వార్డులో టీడీపీకి చెందిన చాంద్‌బాయి, అతని అనుచరులు 50 మందితో వైఎస్సార్‌సీపీ నాయకులు గన్ని కరీం, జాకీర్, అన్సర్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో ఎడవలి శ్రీనివాస్, కొంపల్లి చిన్నరామయ్య, కొంపల్లి శ్రీకాంత్, శివరాం, బ్రహ్మం, సురేష్, సుబ్బారెడ్డి, సాయిబాబు, ప్రభాకర్, ప్రవీణ్, శివరాం, మాదవ్, ఉమాశంకర్, ప్రవీణ్, అబ్దుల్లా, కలందర్, అల్తాఫ్, ఆసిఫ్, ఇస్మాయిల్, సోహెల్, ఇమ్రాన్, ముస్తఫా, బాబా, ఖాజా, షాకీర్ అహమ్మద్ ఉన్నారు.

వైభవం.. పాండురంగస్వామి కల్యాణం

నంద్యాల(అర్బన్): పాండురంగాపురం గ్రామంలో వెలసిన శ్రీరుక్మిణీ సమేత పాండురంగస్వామి వారి కల్యాణం మంగళవారం రాత్రి వైభవంగా జరిగింది. అర్చకులు, పండితుల ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు 108 కలశాలతో సుగంధ ద్రవ్యాభిషేకం, తిరుమంజనం, హారతులు చేపట్టారు. అనంతరం రాత్రి కల్యాణోత్సవం, ఊయల సేవ, తీర్థప్రసాద వినియోగం జరిపారు. బుధవారం కలశ పూజలు, రక్షా హోమాలు జరిగాయి. అనంతరం ఎ శాంతి హోమాలు, పూర్ణాహుతి, కలశ ఉద్వాసనతో పూజలు ముగిశాయి. సాయంత్రం గరుడ వాహనంపై స్వామి, అమ్మవార్లు విహరించారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

రుద్రవరం: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా సాగుతున్నాయి. బుధవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పరీక్షలను తహసీల్దారు మురళీమోహన్, నర్సాపురం ఎస్టీ థోమస్ మార్తోమా పాఠశాలను డిప్యూటీ ఈఓ బేగ్ పరిశీలించారు. నర్సాపురంలో 203 మందికి గాను 17 మంది గైర్హాజరయ్యారు.

చాగలమర్రి: మండల కేంద్రంలో మూడు పరీక్షా కేంద్రాల్లో 10వ తరగతి పరీక్షలు జరుగుతున్నాయి. విద్యార్థులు పరీక్ష రాస్తుండగా వారి తల్లిదండ్రులు చెట్ల కింద నీడలో వారి కోసం ఎదురు చూస్తున్నారు.

గోస్పాడు: మండలంలో బుధవారం జరిగిన ఇంగ్లిష్ పరీక్షలకు 560 మంది హాజరు కావాల్సి ఉండగా 532 మంది విద్యార్థులు హాజరయ్యారు. దీబగుంట్లలో 192 మందికి 185, మోడల్ స్కూల్‌లో 150 మందికి 139మంది, యాళ్లూరులో 82 మందికి 76 మంది, గోస్పాడులో136 మందికి 132 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు ఎంఈఓ అబ్దుల్‌కరీం తెలిపారు.

పిచ్చుకలను కాపాడుదాం

నంద్యాల(వ్యవసాయం): అంతరించి పోతున్న పిచ్చుకలను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని విశ్రాంత శాస్త్రవేత్త, నంది రైతు సమాఖ్య గౌరవాధ్యక్షుడు, డాక్టర్ రవీంద్రనాథ్ పేర్కొన్నారు. బుధవారం సమాఖ్య కార్యాలయంలో ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా.. జీవవైద్యంలో పిచ్చుకలు కీలకం అనే అంశంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ దీవీహయగ్రీవాచార్యులు, వ్యవసాయరంగ నిపుణులు మాధవస్వామి, కైలాసనాథరెడ్డి, దంతవైద్యులు కిశోర్‌కుమార్, రైతు ఓబులపతి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ పిచ్చుకలు రైతుల నేస్తాలు అని, పొలాల్లోని క్రిమికీటకాలను తింటూ రైతుకు సహాయకారిగా ఉంటాయన్నారు. కాగా..నేడు వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు.

అభ్యర్థుల వ్యయ లెక్కింపుపై అప్రమత్తంగా ఉండండి



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీనివాసులు


నంద్యాల: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వ్యయ లెక్కింపుపై అప్రమత్తంగా ఉండాలని, ఇందుకు సహాయ వ్యయ లెక్కింపు అధికారులు, వీడియో సర్వేలైన్ టీమ్‌లు, వీడియో వ్యూవింగ్ టీమ్‌లు పూర్తి స్థాయి శిక్షణ పొందాలని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ఎన్నికల వ్యయ పరిమితిపై సహాయ లెక్కింపు, వీడియో సర్వే లైన్ టీం అధికారుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం సూచించిన మేరకే ఖర్చు చేయాల్సి ఉంటుందని, ఖర్చును లెక్క కట్టి ప్రతి రోజూ నివేదికలు ఇవ్వాలని సూచించారు. సభలు, ర్యాలీలు, ప్రకటనలు, పోస్టర్లు, బ్యానర్లు, వాహనాలు, ఆహార పదార్థాల ఖర్చులతో సహా లెక్కించాలని చెప్పారు. సి విజిల్ యాప్, ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టం ఏర్పాటు చేశారని, ఎన్నికల్లో మద్యం, డబ్బు, ఇతర వస్తువులు రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నోడల్ అధికారి వెంకటసుబ్బయ్య, ఏఎస్పీ కె.ప్రవీణ్ కుమార్ ఉన్నారు.

సువిధ పోర్టల్ ద్వారా అనుమతులు

నంద్యాల(అర్బన్): ఎన్నికల సంఘం సువిధ పోర్టల్ అనే సింగిల్ విండో విధానాన్ని ప్రవేశపెట్టిందని నంద్యాల నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీని ద్వారా రాజకీయ పార్టీలు, అభ్యర్థి లౌడ్‌స్పీకర్లు, ర్యాలీలు, సభలు, సమావేశాలు, వాహనాల వినియోగం, ప్రచారం, బ్యానర్లు, జెండాల ప్రదర్శన, కరపత్రాల పంపకం వంటి వాటి అనుమతులకు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ద్వారా పొందవచ్చన్నారు.

హత్య కేసు నిందితుల అరెస్ట్

- హత్యకు రాజకీయ కారణాలు లేవు
- వేలం హక్కులు దక్కవనే క్షణికావేశంలో ఘటన
- డీఎస్పీ షర్ఫుద్దీన్



నిందితుల అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ షర్ఫుద్దీన్

ఆళ్లగడ్డ: చాగలమర్రి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈ నెల 18న అలాంసాగారి ఇమాం హుసేన్ (20) హత్య కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్ తెలిపారు. స్థానిక రూరల్ పోలీస్ సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులు అలాంసా గారి దస్తగిరి, అలాంసా గారి అబ్దుల్ ఖాదర్‌ను విలేకరుల ఎదుట ప్రవేశపెట్టారు. డీఎస్పీ మాట్లాడుతూ.. చాగలమర్రి పరిధిలో వివిధ రకాల వ్యాపారాలు, వాహనాల గేట్ వసూళ్లకు సంబంధించి ఏడాదికి ఒక సారి వేలం పాటలు నిర్వహిస్తారు. ఈ వేలాలను సుమారు 12 సంవత్సరాల నుంచి నిందితులైన దస్తగిరి, తండ్రి అబ్దుల్ ఖాదర్ దక్కించుకునే వారు. అయితే రెండేళ్ల నుంచి వీరికి పోటీగా మృతుడు ఇమాం, అతని తండ్రి రసూల్ వేలంలో పాల్గొంటుండటంతో వేలాలు ఎక్కువ మొత్తానికి పలుకుతున్నాయి. ఈ క్రమంలో ఈ ఏడాది కూడా వేలంలో పాల్గొనేందుకు ఇరు వర్గాలు డిపాజిట్ చెల్లించారు. వేలం సమయంలో మాటమాటా పెరిగి ఇరువర్గాలు దూషించుకుంటూ తోసుకున్నారు. దీంతో అధికారులు వేలాలను వాయిదా వేశారు. ఇద్దరినీ సముదాయించి గొడవ పెద్దది కాకుండా మృతుడు ఇమాంను మండల పరిషత్ కార్యాలయం పై గదిలో కూర్చోపెట్టారు. కొంత సమయానికి ఇమాం కిందకి దిగి వచ్చి వెళ్తుండగా.. అక్కడే ఉన్న దస్తగిరి ఆవేశంతో తనదగ్గర ఉన్న పిడిబాకుతో ఇమాం గొంతుపై పొడిచాడు. దీంతో అతను అక్కడికక్కడే కుప్పకూలాడు. విషయం తెలిసిన వెంటనే చాగలమర్రి ఎస్ఐ రమణయ్య సంఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడిన ఇమాంను స్థానిక వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. నిందితులైన దస్తగిరి, అబ్దుల్‌ఖాదర్ బుధవారం మల్లెవేముల బస్టాండ్‌లో ఉండగా అరెస్ట్ చేశామని చెప్పారు. తాము పాల్గొంటున్న వేలాలకు అడ్డొస్తున్నారనే క్షణికావేశంలో జరిగిందని, హత్యకు రాజకీయాలతో ఏమాత్రం సంబంధం లేదన్నారు. ఇరు వర్గాలు వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతున్నారని, ఇందుకు ఆధారాలు కూడా ఉన్నాయని డీఎస్పీ వివరించారు. కాగా నిందితులను కోర్టులో హాజరుపరచగరిమాండ్‌కు ఆదేశించారన్నారు. ట్రైనీ డీఎస్పీ రఘువీర్, ఆళ్లగడ్డ రూరల్ సీఐ హనుమంతు నాయక్, చాగలమర్రి ఎస్ఐ రమణయ్య ఉన్నారు.

విద్యార్థులకు గూగుల్ స్వాగ్స్

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ఎస్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం గూగుల్ డెవలపర్ స్టూడెంట్స్ క్లబ్ ఎస్వీఆర్ ఈసీ గూగుల్ క్లౌడ్ స్టడీ జామ్స్ స్వాగ్స్ సోకేస్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వైస్ ప్రిన్సిపాల్ శంకర్ బాబు, ఫ్యాకల్టీ అడ్వైజర్ నెరవాటి రాకేష్‌బాబు, గూగుల్ డీఎస్సీ లీడ్ శ్రీరామ్ దీపక్ విద్యార్థులకు స్వాగ్స్‌కు అందజేశారు.



స్వాగ్స్ సాధించిన విద్యార్థులతో అధ్యాపకులు